నేడు శ్రీ గురుపూజ మహోత్సవం

మోతీనగర్: మధురానగర్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ గురుపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు నగర సంఘ్ సంచాలక్ డా. ఎస్‌కె. జైస్వాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:45 గంటలకు మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వయం సేవక్ బంధువులందరూ హాజరవ్వాలని కోరారు.

ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి తరలిన నాయకులు



ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో కొండాపూర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో పురంధర్ రెడ్డి, సంజీవ రెడ్డి, రామకృష్ణగౌడ్, హరినాథ్, రామ్ చందర్, ఇబ్రహీం, లింగం, చందు, జి ప్రసాద్, శ్రీధర్, పవన్, రమేష్, అశోక్, స్వరూప పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ దరఖాస్తుల ఆహ్వానం

మోతీనగర్: నిర్మల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మధురానగర్ శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి మిథున్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు జూలై 5వ తేదీలోగా మధురానగర్ మెట్రోస్టేషన్ పిల్లర్ నెంబర్ సి1468 చిరునామాలో సంప్రదించాలని సూచించారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు మహిళలకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదువుకున్న మహిళలు అర్హులని, మరిన్ని వివరాలకు 6309987155 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్లాస్టిక్ వాడటాన్ని ఎవరికి వారు నిషేధించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని మోడ్రన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రజనీ కోరారు. శనివారం ఈ మేరకు విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలు వివరించారు. స్వర్ణధామనగర్, డెయిరీఫాం నుంచి వివిధ కాలనీల మీదుగా ర్యాలీ కొనసాగింది. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు, పేపర్, క్లాత్ బ్యాగులను వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అవార్డు అందజేసిన ఎంపీ



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ, మూడవ ఫేజ్‌లో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా అవార్డులు అందజేశారు. ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బీజేపీ స్పోక్స్ పర్సన్ రమేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రమాదం!

- బస్సులపై దృష్టి సారించని విద్యాసంస్థల యాజమాన్యాలు
- ఇటీవలే వివిధ చోట్ల ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- అధికారుల తనిఖీలు అంతంతే



ఆల్విన్‌కాలనీ, తులసినగర్‌లో ఆగిపోయిన స్కూల్ బస్సును నెడుతున్న విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే జరిగిన పలు ప్రమాదాలు.. ఓ విద్యార్థి స్కూల్ బస్సు కింద పడి చనిపోవటం వంటి ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు, ఆర్‌టీఏ అధికారులు స్కూల్ ప్రారంభానికి ముందే బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు వాహనాల తనిఖీలు, రక్షణ ఏర్పాట్లు, డ్రైవర్ల పనితీరు వంటి వాటిపై శ్రద్ధ వహించాలి. ప్రభుత్వ రవాణా శాఖ ఉన్నతాధికారుల నుంచి ఫిట్‌నెస్, ఇతర పత్రాలను పొందాల్సి ఉంటుంది. ఆర్‌టీఏ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధ్యలోనే స్కూల్ బస్సులు ఆగిపోతుండటంతో విద్యార్థులు బస్సులను నెట్టాల్సి వస్తున్నది. రన్నింగ్‌లో ఉన్న బస్సు ఆగిపోతే బ్రేకులు ఫెయిలైనా బస్సులోని విద్యార్థులందరి పరిస్థితి ఆగమ్య గోచరంగా మారుతుంది.

నిబంధనలు పట్టవా?

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో ప్రతి వీధిలో చిన్న చిన్న గల్లీల్లో కూడా ప్రయివేట్ స్కూల్స్ ఉన్నాయి. ఆర్టీఏ నిబంధనలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. అక్కడక్కడా స్కూళ్లలో బస్సులకు పార్కింగ్ కానీ, స్కూల్ ముందు వాహనాన్ని ఆపి విద్యార్థులను క్షేమంగా కిందకు దింపటానికి కూడా అనువైన పరిస్థితి లేదు. ముందు నుంచి, వెనుక నుంచి వాహనాలు దూసుకు వచ్చి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఎలాంటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందకుండానే విద్యార్థులను ఈ బస్సులలో తరలిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కూడా డ్రైవర్లను తక్కువ జీతాలతో యాజమాన్యాలు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితం ఆల్విన్‌కాలనీ తులసి నగర్‌లో ఓ వీధిలో ఆడుకుంటుండగా ఓ విద్యార్థిపై బస్సు వెళ్లటంతో ఆ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కాలనీలో మరుసటి రోజు ఓ స్కూల్ బస్సు ఫిట్‌నెస్ లేక మధ్యలోనే ఆగిపోవటంతో విద్యార్థులు ఆ బస్సును తోస్తూ కనిపించారు. ఇలాంటి సంఘటనలు కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో నిత్యం జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని, విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసినప్పుడే హడావుడి చేయటమే తప్ప తనిఖీలు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, స్కూల్ యాజమాన్యాలు బస్సుల పట్ల, డ్రైవర్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యాజమాన్యాలు నిర్లక్ష్యం వీడాలి



స్కూల్ బస్సులు, డ్రైవర్ల పట్ల పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వీడాలి. ఎప్పటికప్పుడు పాఠశాల సిబ్బంది విద్యార్థుల జీవితాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఫిట్‌నెస్ లేని వాహనాలు, మద్యం సేవించే డ్రైవర్ల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ప్రమాదాలు చోటు చేసుకుంటే వారి తల్లిదండ్రుల మనోవేదనను అర్థం చేసుకుని స్కూల్ వాహనాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ మధ్య కాలంలో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులతో ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌టీఏ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– చిరుమర్తి రాజు, స్థానికుడు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఆల్విన్‌కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన మండపంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో కూకట్‌పల్లి, హైదర్‌నగర్‌కు చెందిన చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. తిరుపతిలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ ఆస్థాన మండపంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. హైదర్‌నగర్‌కు చెందిన రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరింపచేశారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేత



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ.. పాఠ్య పుస్తకాల్లో ఉన్న సారాంశమే పరీక్షల్లో వస్తుందని, పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదివి ఎక్కువ మార్కులు సాధించవచ్చన్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ సతీష్ గౌడ్ తదితరులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఒరిస్సా రాష్ట్ర ప్రాంత ప్రజలు ఆరాధించే జగన్నాథ స్వామి రథయాత్ర కార్యక్రమాన్ని ఒరిస్సా జగన్నాథ రథ యాత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రదీప్ పండిత్, సభ్యులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయవాది వీరమల్ల కేశవరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి ప్రియాంక హాజరయ్యారు. మాదక ద్రవ్యాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నటరాజ్, అనిల్ వైద్య, శ్రీదేవి, హెచ్‌ఎం రాధా పద్మజ, ఉపాధ్యాయులు, ఎస్‌ఐ అప్పారావు పాల్గొన్నారు.



బోనాలను శాంతియుతంగా జరుపుకోవాలి

బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి



మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి

బాలానగర్: ఆషాఢ మాసంలో జరిగే బోనాలను శాంతియుతంగా జరుపుకోవాలని బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులతో శనివారం శాంతి కమిటీ సమావేశాన్ని సీఐ నర్సింహ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల పండుగ సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని అన్నారు. బోనాలను శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా ఆలయ కమిటీలు కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట, మహిళల భద్రత, ట్రాఫిక్ సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉండే నిర్వాహకులు తగిన సహకారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, పుకార్లు వ్యాపించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సరితా పటేల్ రెడ్గి, హాజీ మియా, నర్సింహులు, ఎస్‌ఐలు వెంకటేశం, వినోద్, ఏఎస్‌ఐ హనుమయ్య, ఇతర సిబ్బంది, బోనాల నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

మూసాపేట: మూసాపేట శ్రీహరి నగర్‌లోని కిడ్జి మౌంట్ లిటెరా పాఠశాలలో గ్రీన్ డే సందర్భంగా శనివారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మొక్క నాటి వాటి సంరక్షణ కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటే విధంగా అలవాటు చేసుకోవాలని సూచించారు.



జేఎన్‌టీయూలో 'సేవ్ కాన్స్టిట్యూషన్ మార్చ్'



బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం ప్రధాన గేటు వద్ద 'సేవ్ కాన్స్టిట్యూషన్ మార్చ్' నిర్వహించారు. రాజ్యాంగ నుంచి సోషలిజం, లౌకికవాదాన్ని తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని విద్యార్థి నాయకులు అన్నారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సన్నీ ఇమాన్యుయల్, ప్రసాద్, చేతన్, సలీం, భూమేష్, మణికంఠ, చరిత్, సృజన్, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

పీర్ల పండుగ



మూసాపేట: మూసాపేటలోని వార్డు కార్యాలయం సమీపంలో శనివారం మొహర్రం సందర్భంగా పీర్లను ఏర్పాటు చేశారు. పత్తర్ గట్టి, హిమం ఖాసిం, హస్సేన్ హుస్సేన్, షేక్ అలీ అబ్బాస్ వంటి పీర్లను నిర్వహించామని ముజావర్ మహ్మద్ హమేద్ తెలిపారు. 9 రోజుల పాటు పీర్ల పండుగ నిర్వహిస్తామని తెలిపారు.

ఉత్కృష్ట సేవా పతకం అందుకోనున్న బాలానగర్ డీసీపీ



జీడిమెట్ల: బాలానగర్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న కె.సురేష్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకం ప్రకటించింది. 15 సంవత్సరాలుగా శాంతి భద్రతలు, కమ్యూనిటీ పోలీసింగ్, మావోయిస్టు నిరోధక కార్యకలాపాలలో భాగంగా ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఈ పతకాన్ని ప్రకటించింది. ప్రత్యేకంగా ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్, జిల్లాల్లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా ఆయన గుర్తింపు పొందారు.

సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్

నిజాంపేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. శనివారం బాచుపల్లిలోని వినాయక స్టీల్ ట్రేడర్స్ డీలర్‌షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని అన్నారు. తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను 30 మందికి అందజేశారు.

ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ నామకరణం అభినందనీయం

కూకట్‌పల్లి: సీఎల్‌పీ మాజీ నేత జనార్ధన్ రెడ్డి పేరును కొండాపూర్, గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌కు నామకరణం చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పేదల నాయకుడిగా, ఖైరతాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి సమస్యలపై గళం విప్పిన నేత పీజేఆర్ అని అన్నారు. పీజేఆర్ మన మధ్య లేకపోయినా ఆయన త్యాగాలు, సేవలు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా వెలుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు.

బాలానగర్‌పై చిన్న చూపు తగదు



కూకట్‌పల్లి: బాలానగర్ ప్రాంత పేద ప్రజల పట్ల కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చిన్న చూపు చూస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని గత సంవత్సరం నుంచి నిధులు వెచ్చించి 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కాకుండా స్థలం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే చేసిన కృషి, బాలానగర్‌లో 100 పడకల ఆసుపత్రి కట్టిస్తా అని చెప్పిన మాటపై ఎందుకు శ్రద్ధ చూపించటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల హామీని ఎమ్మెల్యే గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కృష్ణారావు ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనించాలని కోరారు. బాలానగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తే పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే వేలాది మంది కార్మిక కుటుంబాలు వైద్యానికి నోచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

గడ్డర్ ఏర్పాటు.. వాహనదారులకు తిప్పలు !

అంత్యక్రియల కోసం వచ్చే వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి

కూకట్‌పల్లి: ప్రభుత్వం ప్రధాన రోడ్లను అనుసంధానం చేస్తూ ఫ్లై ఓవర్, నాలాలపై బ్రిడ్జీలను నిర్మాణం చేస్తుంది. మరోవైపు కొంతమంది ఆ రహదారులను సామాన్యులకు అందుబాటులో లేకుండా వాహనాల రాకపోకలకు అడ్డుగా గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. కూకట్‌పల్లిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం కాలనీకి వెళ్లే రహదారిలో నాలా అడ్డుగా ఉండటంతో ఇటీవలే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. హైటెన్షన్ రహదారిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూకట్‌పల్లి ప్రధాన రహదారి నుంచి జగద్గిరిగుట్ట వరకు వెళ్లే ఈ హైటెన్షన్ రహదారిని వెడల్పు చేయడమే కాకుండా బ్రిడ్జి నిర్మాణాలు కూడా చేపట్టారు. కొందరు కాలనీ పెద్దలు ఇరువైపులా గడ్డర్స్ నిర్మాణం చేపట్టారు. దీంతో అంత్యక్రియల వాహనాలు కూడా రహదారి గుండా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నాలా బ్రిడ్జి నిర్మాణం అందుబాటులోలేకుండా పోయింది. ఇదిలా ఉండగా.. ఈ రహదారి వంతెన కేవలం చుట్టు పక్కల కాలనీల వాసులకు పార్కింగ్ కేంద్రంగా మారింది. రహదారి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో వస్తే ఆల్విన్‌కాలనీ, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు నాలా వంతెనపై ఉన్న గడ్డర్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



అక్రమ నిర్మాణం సీజ్



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని రోడ్డు నెంబర్ 3లో ఇడబ్ల్యూఎస్ 289లో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని శనివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్ 1955 అండర్ సెక్షన్ 461-ఏ ప్రకారం సీజ్ చేశామని అధికారులు తెలిపారు. అనుమతులు తీసుకోకుండా అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకవేళ భవనం పూర్తి అయినా భవనాన్ని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిర్యాదు చేసి ఇంటికొచ్చేసరికి ..

అక్రమ నిర్మాణం కూల్చివేత

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు
- మూడు గంటల్లోనే కూల్చివేసిన సిబ్బంది
- హర్షం వ్యక్తం చేసిన రుక్మిణి ఎస్టేట్ కాలనీవాసులు



పార్కులో హైడ్రా సిబ్బంది కూల్చివేసిన అక్రమ నిర్మాణం

కుత్బుల్లాపూర్: ప్రజా అవసరాల కోసం వదిలిన పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం చోటు చేసుకున్న విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. మూడు గంటల్లోనే సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రుక్మిణి ఎస్టేట్ సర్వే నెంబర్ 218, 214 లో ఉన్న 1200 గజాల పార్కు స్థలం ప్రజా అవసరాల కోసం వదిలేశారు. ఈ స్థలంపై కొంతమంది కన్నేసి అందులో 600 గజాలను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేసి గది, ప్రహరీ నిర్మించారు. ఈ విషయంపై స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ను శుక్రవారం సాయంత్రం కలిసి ఫిర్యాదు చేశారు. ఇంటికి వచ్చేసరికి పార్కు స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణంతో పాటు ప్రహరీని కూల్చివేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కూల్చివేయడమే కాకుండా హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఫిర్యాదు అందుకున్న కేవలం మూడు గంటల్లోనే స్పందించిన తీరుపై శనివారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని హైడ్రా జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



హైడ్రా జిందాబాద్ అంటూ ప్లకార్డులతో కాలనీవాసులు